సొంత భవనం సాకారమయ్యేదెన్నడో?

- రేకుల షెడ్డులో వేల్పూర్ ఎస్సీ గురుకుల పాఠశాల
- పని చేయని సీసీ కెమెరాలు
- సరిపడా మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు


వేల్పూర్ ఎస్సీ గురుకుల పాఠశాల భవనం


ఇరుకుగదిలో టీవీ చూస్తున్న విద్యార్థులు


ఒకే గదిలో ఉదయం క్లాసులు, రాత్రి నిద్రపోవడం

ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని పిప్రి రోడ్డులో వేల్పూర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో రేకుల షెడ్డులో కొనసాగుతోంది. ఈగురుకుల పాఠశాల, కళాశాలలో మొత్తం 458 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్ గ్రామానికి మంజూరైన ఈ పాఠశాల అక్కడ భవనం లేకపోవడంతో, 2017 నుంచి ఆర్మూర్ పట్టణంలోని పాత గురుకుల భవనంలోకి తరలించి తరగతులు నిర్వహిస్తున్నారు. గదుల కొరత కారణంగా, క్లాసులు జరిగిన తరువాత అదే గదుల్లో రాత్రి నిద్రించే పరిస్థితి ఉంది. ఎండకాలంలో అధిక ఉక్కపోత, వర్షాకాలంలో చలితో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 458 మంది విద్యార్థులు ఉండగా కేవలం 20 మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఆరుబయట స్నానాలు చేయాల్సి వస్తోంది. ఈ సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు పాఠశాలలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఇటీవల ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో కెమెరాలు పనిచేసి ఉంటే సమాచారం తెలుసుకునే అవకాశం ఉండేదని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. ఆర్మూర్ ఎస్సీ గురుకుల పాఠశాలకు సంబంధించిన బోరు ద్వారానే ఈపాఠశాలకు నీటిసరఫరా అవుతోంది. విద్యార్థులు తమ దుస్తులను తరగతి గదుల కిటికీలపై ఆరబెట్టుకుంటున్నారు. ప్రతి ఆదివారం బియ్యం, సంచులు, కూరగాయల మధ్య విద్యార్థులు ఇరుకుగా కూర్చుని టీవీని చూస్తున్నారు. నూతన భవనం నిర్మించాలని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

ప్రభుత్వం చొరవ చూపాలి

ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి చొరవచూపాలి. రేకుల షెడ్డులో ఎండకాలం ఉక్కపోతతో, చలికాలం చలితో ఇబ్బందులు పడాల్సివస్తుంది. గురుకులంలో మంచి బోధన ఉంది. అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.

– లూవీస్, విద్యార్థి

నూతన భవనం నిర్మించాలి..

గురుకుల పాఠశాలకు ప్రభుత్వం నూతన భవనం నిర్మించాలి. తరగతులు అయిపోయాక అదే గదిలో నిద్రిందిచాల్సి వస్తుంది.నూతన భవనంతో ఇబ్బందులు తీరుతాయి.

– కార్తిక్, విద్యార్థి

నిధులు మంజూరు

పాఠశాల మరమ్మతులతో పాటు 12 గదుల నిర్మాణానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ. 1.29 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రాసెస్ నడుస్తోంది. భవనం నిర్మిస్తే ఇబ్బందులు తొలుగుతాయి.

– సుదర్శన్, వేల్పూర్ ఎస్సీ గురుకుల స్కూల్ ప్రిన్సిపల్

ఆరేళ్లుగా అద్దె భవనంలో..

- బాల్కొండలో మహాత్మాజ్యోతీబా పూలే గురుకుల పాఠశాల పరిస్థితి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు


బాల్కొండలో కొనసాగుతున్న బాలికల గురుకుల పాఠశాల

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతీబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు ఆరేళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతుంది. పాత జాతీయ రహదారి పక్కన గల ఓ ప్రయివేట్ భవనంలో 2019–20 విద్యా సంవత్సరంలో పాఠశాలను ప్రారంభించారు. పాఠశాలలో 5 వరతగతి నుంచి పదో తరగతి వరకు 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలతో పాటు వసతి గృహం కూడా అద్దె భవనం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం జాతీయ రహదారి వెంట నడిచి విద్యార్థులు తరగతులకు వెళ్లాలి. ఈ క్రమంలో కుక్కలు వెంటపడుతున్నాయి. పాఠశాల భవనం నిర్మాణం కోసం కనీసం స్థల సేకరణ కూడా చేపట్టలేదు.

కళాశాల మంజూరు..

పాఠశాలతో పాటు కళాశాలను కూడ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక్కడ సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ప్రారంభించారు. కళాశాల బాల్కొండదే అయినా ప్రస్తుతం ఆర్మూర్ మండలం మునిపల్లిలో నిర్వహిస్తున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల, కళాశాలకు సొంత భవనం నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విన్నవించాం..

అద్దె భవనంలోని ఇబ్బందులను ఉన్నత అధికారులకు పలుమార్లు విన్నవించాం. ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం నిర్మాణం జరిగితే అందులోకి మార్చే అవకాశం ఉందని చెబుతున్నారు. సొంత భవనం నిర్మిస్తే విద్యార్థులకు అవస్థలు తీరుతాయి.

– హేమవతి, ప్రిన్సిపల్, బాల్కొండ

భక్తుల ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గోల్‌బంగ్లా ప్రాంతంలోని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో శ్రావణ శనివారం కావడంతో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పురోహితుడు వెంకయ్య స్వామివారికి అభిషేకం, నిర్వహించి పువ్వులతో అలంకరించారు. భక్తులకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సర్వ సమాజ్ సభ్యులు ఇబ్బందులు కలుగకుండా చూశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బోధన్: మండలంలోని అమ్దాపూర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌ల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విద్యాలయం ప్రత్యేక అధికారిణి హిమబిందు శనివారం ప్రకటనలో తెలిపారు.ఎంపీసీ గ్రూప్‌లో 27 సీట్లు, బైపీసీ గ్రూప్‌లో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు విద్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.వివరాలకు సెల్ ఫోన్ 8501077646 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

బాల్కొండ పాఠశాలకు వీఆర్, ఏఆర్ ల్యాబ్..



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఎం శ్రీ పథకంలో భాగంగా వీఆర్ (వర్చువల్ రియాల్టీ), ఏఆర్ (అగ్మెంటెడ్ రియాల్టీ) ల్యాబ్‌కు ఎంపికైందని ఎంఈవో రాజేశ్వర్ తెలిపారు. శనివారం పాఠశాలకు ఏఆర్, వీఆర్ ల్యాబ్ సంబంధించిన సామగ్రిని పాఠశాలకు సరఫరా చేశారు. సామగ్రిని చూపుతూ ఆయన మాట్లాడారు. జిల్లాలోని పీఎం శ్రీ కింద 10 పాఠశాలలను పైలట్ ప్రాజెక్ట్‌కు ఎంపిక చేశారన్నారు. అందులో బాల్కొండ ఉన్నత పాఠశాల ఒకటి అన్నారు. వీఆర్, ఏఆర్ ల్యాబ్‌కు రూ. 9 లక్షలు ఖర్చు అవుతుందన్నారు.

ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు నిర్వహించాలి

బాల్కొండ: కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులకు స్పౌజ్, మ్యూచ్‌వల్ బదిలీలతో పాటు సాధారణ బదిలీలు కూడా నిర్వహించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ. రమేశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేజీబీవీ, అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు స్పౌజ్, మ్యూచ్‌వల్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడం హర్షణీయమన్నారు.

అవసరం మేరకే ఎరువులు తీసుకెళ్లాలి

డొంకేశ్వర్(ఆర్మూర్)/కమ్మర్‌పల్లి : రైతులు అవసరం ఉన్నంత మేరకే ఎరువులు కొని తీసుకెళ్లాలని మండల వ్యవసాయాధికారి మధుసూదన్ సూచించారు. శనివారం డొంకేశ్వర్‌తో పాటు సిర్పూర్ సొసైటీ గోదాముల్లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు.అన్ని గ్రామాల సొసైటీ గోదాముల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు.రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని కొరత లేదని ఆందోళన చెందవద్దని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ పేర్కొన్నారు. మండలంలోని ఉప్లూర్, కమ్మర్‌పల్లి, హాసకొత్తూర్, కోనసముందర్, కోనాపూర్ గ్రామాల్లోని పీఏసీఎస్ గిడ్డంగుల్లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తాం

పెర్కిట్(ఆర్మూర్): త్వరలో విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బాలుర బీసీ వసతి గృహం విద్యార్థులకు విద్యార్థి సేన ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. నాయకులు వికాస్, అక్షయ్, నంద కిషోర్, జెశ్వంత్, దుర్గా ప్రసాద్, హర్షవర్ధన్, అభినయ్ తదితరులున్నారు.

హక్కుల సాధనకు దివ్యాంగులు ముందుకురావాలి



రెంజల్(బోధన్) : హక్కుల సాధనకు దివ్యాంగులు ముందుకు రావాలని వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ సూచించారు. శనివారం రెంజల్‌లో నిర్వహించిన మహాగర్జన సన్నాహాక సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకుని దివ్యాంగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ నేతృత్వంలో ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించే పెన్షన్‌దారుల మహాగర్జనకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బీరప్ప, షేక్ సలీం, ఎమ్మార్పీఎస్ నాయకులు లసింగారి భూమయ్య, పోశెట్టి, మోహన్, గంగాధర్, హన్మాండ్లు, భూమవ్వ, ప్రకాష్, మండలంలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

ఆర్మూర్ గాంధీకి సన్మానం



బాల్కొండ: ఆర్మూర్ గాంధీగా పేరుగాంచిన ఆర్మూర్ పట్టణానికి చెందిన అబ్దుల్ హుస్సేన్‌ను శనివారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అబ్దుల్ హుస్సేన్ తన ఆటోలో ఆర్మూర్ నుంచి మహిళ ఉపాధ్యాయినిలను ఉచితంగా పాఠశాలకు తీసుకువచ్చాడు. కొన్నేళ్లుగా మహిళలను, దివ్యాంగులను తన ఆటోలో ఉచితంగా ఇంటికి చేర్చుతూ సేవలు అందిస్తున్నాడు. ఆటో కోసం 50 వేలు ఫైనాన్స్ తీసుకుని ఉచిత ప్రయాణం అందిస్తున్నాని పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


సాటాపూర్‌లో లబ్ధిదారులకు రేషన్‌కార్డు మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్) : పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలో నూతన లబ్ధిదారులకు రేషన్‌కార్డు మంజూరు పత్రాలను అందించారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు రేషన్‌కార్డులు, డబుల్ బెడ్‌రూంలను అందించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబమే లాభపడింది తప్పా పేదలకు న్యాయం జరుగలేదని విమర్శించారు. మండలానికి 505 రేషన్‌కార్డులు మంజూరయ్యాయని, త్వరలో మరిన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామన్నారు. ఆయిల్‌పాం సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీకి నిర్మల్ జిల్లా నాయకులు పోటీపడుతున్నారని, ఇక్కడి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బోధన్ నియోజకవర్గంలో ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్థల పరిశీలన పూర్తయిందన్నారు. సుమారు 120 ఎకరాల్లో రూ. వంద కోట్లతో నిర్మించే ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వార త్వరలో ప్రారంభించుకుందామని వెల్లడించారు. అనంతరం గ్రామంలో అదనపు కలెక్టర్ అంకిత్‌తో కలిసి మొక్కలు నాటారు. ఉర్దూ అకాడమీ చైర్మెన్ తాహెర్‌బిన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అంతరెడ్డి రాజరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మొబిన్‌ఖాన్, నాయకులు రాములు, సాయిబాబగౌడ్, సురేందర్‌గౌడ్, గయాసొద్దిన్, నితిన్, ఇందిరారెడ్డి, గంగాకిషన్, ఒడ్డెక్క మోహన్, శ్రీను, సురేశ్‌పటేల్, జావీద్, కార్తీక్ యాదవ్, ఎంఎల్ రాజు, గైని కిరణ్, కుర్మె శ్రీనివాస్ యాదవ్, ఆసాని అనీల్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియా అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో శనివారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పర్యటించారు. శర్బతీ కెనాల్ వద్ద నీరు నిలిచి ఉండడంతో నీరు వెళ్లడానికి రోడ్డును తవ్వి మరమ్మతులు చేపడుతున్న పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని అర్‌అండ్‌బీ డీఈని ఆదేశించారు. అనంతరం ఉర్దూఘర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. వర్షాకాలంలో ఆస్పత్రి ఊరుస్తుందని ఎమ్మెల్యే దృష్టికి వైద్యులు తీసుకు వచ్చారు. రూ. 40 లక్షలు కేటాయించి మరమ్మతులు చేయిస్తామన్నారు. అనంతరం బల్దియా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బల్దియా అధికారులు సిబ్బంది ఆదాయంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న భువన్ సర్వేకు ప్రజలు సహకరించాలని, అసెస్‌మెంట్ లేకపోతే చేయించుకోవాలని సమస్యలు ఉంటే కమిషనర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని అధికారులు బాధ్యతతో పని చేయాలని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా వ్యాప్తంగా రూ. 22 కోట్లు వెచ్చించి మరుగుదొడ్లు నిర్మించామని, అవసరం ఉన్న చోట గదులు నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. రాకాసీపేట్‌లో గ్రేవ్ యార్డుకు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. డీసీసీ ప్రెసిడెంట్ మానాల మోహన్ రెడ్డి, నాయకులు గడుగు గంగాధర్, కమిషనర్ జాదవ్ కృష్ణ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో మొక్కలు పంపిణీ చేస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి, మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే 5వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి ప్రొసీడింగ్ కాపీ అందజేశారు. మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, జంబిహనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు పండిత్ పవన్, షేక్ మున్ను, శాల ప్రసాద్, కొంతం మురళి, రమణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

ఆర్మూర్: నందిపేట మండలం సీహెచ్ కొండూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినయ్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో సీహెచ్ కొండూర్ మాజీ సర్పంచ్ ప్రభాకర్ రావు, మాజీ ఉపసర్పంచ్‌లు మంగు సందీప్, బాలనోళ్ల దేవిదాస్, నాయకులు వెలువల నరసయ్య, బోండ్ల వెంకటేశ, ఆర్య ప్రవీణ్, గుండు నాగేష్, ఆరే మీసాల రాజు, తెనుగు దేవేందర్, షాదుల్లా, జింకల శ్రీనివాస్, లక్కంపల్లి నవీన్, పెద్దనాగ రావు, గోనేటి దేవ రెడ్డి తదితరులున్నారు.

ఈ కార్యక్రమంలో నందిపేట్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద మహిపాల్, ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, ఆర్మూరు పట్టణ, నందిపేట్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు ఇప్పిస్తా

మాక్లూర్: నియోజకవర్గంలోని ఆయా గ్రామాల అభివృద్ధి పనులకు నిధులు ఇప్పించే బాధ్యత తనదని వినయ్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని బోర్గాం (కె) గ్రామంలో మహాలక్ష్మీ ఆలయం వరకు సీసీ రోడ్డు, గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులు ఇప్పిస్తానని గ్రామస్తులకు హామీఇచ్చారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి, పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు రవిప్రకాష్, మాక్లూర్ విండో చైర్మన్ బూరోల్ల అశోక్, మాజీ సర్పంచ్ రాజు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ అభివృద్ధికి రూ. 15లక్షల నిధులు మంజూరైనట్లు ఆలయ ఈవో శ్రీరామ్ రవీందర్, ఆలయ చైర్మన్, రేగుళ్ల సత్యనారాయణ తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియెజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు వారు తెలిపారు.

పొంగుతున్న వాగులు


దొమలెడ్గి- కొల్లూర్ తాత్కాలిక రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు


రుద్రూర్- బొప్పాపూర్ రోడ్డుపై రాకపోకలు నిలిపివేస్తూ.. బోర్డు ఏర్పాటు చేసిన ఎస్సై సాయన్న

రుద్రూర్/వేల్పూర్/బోధన్‌టౌన్/బోధన్/డొంకేశ్వర్ : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాల్లో వాగులు పొంగి పొర్లుతున్నారు. చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరుతుంది.వివిధ గ్రామాల్లో చెరువుల నుంచి అలుగులు ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి.బొప్పాపూర్–రుద్రూర్ రహదారిపై ఉన్న వాగు లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. దీంతో ఎస్సై సాయన్న ట్రాఫిక్ బోర్డులు రోడ్డుపై ఏర్పాటు చేసి ఈ రహదారి ద్వారా రాకపోకలను నిలిపివేశారు. పోతంగల్ మండలం కొల్లూర్– దొమలెడ్గి రహదారిపై వంతెన పనులు కొనసాగుతున్నందున తాత్కాలికంగా వేసిన రోడ్డు పై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. గత రెండేళ్ల క్రితం వంతెనె పనులు ప్రారంభించారు. పిల్లర్లు వేసి వదిలివేయడంతో వర్షకాలంలో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బోధన్ పట్టణ ప్రధాన తాగునీటి వనరు బెల్లాల్ చెరువు నిండడంతో అలుగు పారుతుంది. నిజాంసాగర్ నుంచి నీళ్లు వదలడంతో బెల్లాల్ చెరువునిండుకుండలా మారింది. తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దులో సాలూర మండల కేంద్రం శివారులో ఉన్న మంజీర నదిలో స్వల్పంగా వరద నీరు చేరి జలకళను సంతరించుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఎగువ ప్రాంతంలోని వాగు వరద నీరు మంజీర నదిలోకి చేరుతోంది. వేల్పూర్–అమీనాపూర్ గ్రామాల మధ్య ఆర్మూర్ ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డుపై శనివారం భారీ వృక్షం కూలింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డుపై చెట్టు కూలిపోవడంతో ఆర్మూర్ వైపు, భీమ్‌గల్ వైపు వెళ్లే వాహనాలు చాలాసేపు నిలిచిపోయాయి. వేల్పూర్ గ్రామస్తులకు విషయం తెలియడంతో వెంటనే జేసీబీ తెప్పించి చెట్టును పక్కకు తొలగించారు. దాంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఎడపల్లి మండలంలోని జానకంపేటలో శ్రీనివాస్‌రావు (పెద్ద పంతులు)కు చెందిన పాతకాలం నాటి పెంకుటిల్లు గోడలు కూలిపోయాయి. దీంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. కొంత కాలంగా కుటుంబీకులు ఈపెంకుటింట్లో నివాసం ఉండటం లేదని, ఇతర చోట ఉంటున్నారని స్థానికులు తెలిపారు. డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్–కోమట్‌పల్లి గ్రామాల మధ్య వాగును తహసీల్దార్ నరేశ్ కుమార్, ఆర్ఐ అశోక్‌సింగ్ పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రవహిస్తున్న వాగులు, చెరువులు వద్దకు వెళ్లకూడదని తహసీల్దార్ సూచించారు. కోమట్‌పల్లి శివారులో చెరువు అలుగు పారే అవకాశం ఉందని, ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలన్నారు. నీటి ప్రవాహం పెరిగితే రోడ్డుకిరువైపులా ట్రాక్టర్లు,బారికేడ్లు ఉంచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు.


అలుగు పారుతున్న బెల్లాల్ చెరువు


వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేశ్, ఆర్ఐ


కోటగిరి గరిక వాగులో చేపలను పడుతున్న స్థానికులు

పీహెచ్‌డీ పట్టా పొందిన అంక్సాపూర్ వాసి


సత్తెమ్మ

వేల్పూర్: వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామానికి చెందిన ద్యావతి సత్తెమ్మ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్ పొందినట్లు శనివారం విలేకరులకు తెలిపారు. గద్వాల జిల్లా ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సత్తెమ్మ ఉస్మానియా యూనివర్సిటీలో 'ఏ స్టడీ ఆన్ ఫిక్స్‌డ్ పాయింట్ ది ఓరమ్స్ ఇన్ మెట్రిక్ అండ్ జనరలైజ్‌డ్ మెట్రిక్ స్పేసెస్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఓయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేథమెటిక్స్ ఆచార్యులు డాక్టర్ ఎస్.విజయలక్ష్మి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా పొందారు. సత్తెమ్మ పీహెచ్‌డీ పట్టా పొందడంపై సన్నిహితులు, శ్రేయోభిలాషులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్


బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న భారతీయ విద్యార్థి సేన నాయకులు, కార్యకర్తలు


కమ్మర్‌పల్లిలో జవాన్లను సన్మానిస్తున్న వ్యాపారులు

బోధన్‌టౌన్: భారతీయ విద్యార్థి సేన ఆధ్వర్యంలో శనివారం బోధన్‌లో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా మీదుగా పాత బస్టాండ్ , హనుమాన్ మందిరం నుంచి తిరిగి అంబేడ్కర్ చౌరస్తా వరకు సాగింది. అనంతరం కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరులకు నివాళులు అర్పించారు. అనంతరం బీవీఎస్ పట్టణ అధ్యక్షులు కె. లింగం మాట్లాడారు.బీజేవైఎం అధ్యక్షులు గౌతం గౌడ్, నాయకులు బిల్లా విజయ్, సాగర్ గౌడ్, కళ్యాణ్, ఆకాష్, అరుణ్ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్లకు సన్మానం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని వ్యాపార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్లు పోల్కం తరుణ్, చింతకుంట నవీన్, సజన్ సింగ్‌లను వారు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న సీపీ సాయి చైతన్య

ఆర్మూర్‌టౌన్: అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ సాయి చైతన్య అన్నారు. మోర్తాడ్ పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఆర్మూర్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులు క్లియర్ చేయాలని పోలీసులను ఆదేశించారు. గ్రామ పోలీస్ అధికారులు ప్రతిరోజు గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మమేకమై నేర నియంత్రణకు కృషి చేయాలని అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాలలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి ఆర్మూర్, బాల్కొండ, భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, సీఐ శ్రీధర్ రెడ్డి, సీఐ పొన్నం సత్యనారాయణ, ఎస్సైలు పాల్గొన్నారు.